సాక్షి వికారాబాద్

మంగళవారం । 13 । ఫిబ్రవరి । 2024



మార్కండేయ జయంతి

తాండూరు పట్టణంలోని మార్కండేయ స్వామి ఆలయంలో స్వామివారి జయంతి వేడుకలు వైభవంగా జరిగాయి. 8లో▸



సేవ చేయడంలోనే సంతృప్తి

తమకు అందే అవకాశాలతో ప్రజలకు సేవ చేస్తే ఎంతో సంతృప్తిగా ఉంటుందని పాప్ సింగర్ స్మిత అన్నారు. 8లో▸



ఘనంగా మల్లన్న జాతర

మండల పరిధిలోని గోట్లపల్లి మల్లికార్జున ఆలయంలో శివపార్వతుల కల్యాణం ఘనంగా నిర్వహించారు. 9లో▸

‘ఉపాధి’కి ‘కోడ్’ గండం

ప్రారంభించాల్సిన పనులు 766.. ఖర్చు చేయాల్సిన నిధులు రూ.59.03 కోట్లు.. వారం రోజుల గడువు.. ఇదీ జిల్లాలో ఉపాధి హామీ పనులకు సంబంధించిన పరిస్థితి. మరో వారం రోజుల్లోపు లోక్‌సభ ఎన్నికల కోడ్ అమల్లోకి రానుందన్న ఊహాగానాల నేపథ్యంలో ఈనెల 15వ తేదీలోపు పథకానికి సంబంధించిన పనులన్నీ ప్రారంభించాలని జిల్లా పంచాయతీ రాజ్ ఇంజనీర్లకు కలెక్టర్ డెడ్‌లైన్ విధించారు. ఈ క్రమంలో అధికారులు, కాంట్రాక్టర్లు, ప్రజాప్రతినిధులు ఆయా పనులను పూర్తిచేయడంలో ఏ మేరకు సఫలీకృతమవుతారనే విషయం ఇప్పుడు సర్వత్రా ఆసక్తిగా మారింది. గతేడాది కూడా ఇలాగే చివర్లో హడావిడి చేసినా పనులు పూర్తి కాకుండా మిగిలిపోయాయి. దీంతో ఆర్థిక సంవత్సరం ముగిశాక ప్రత్యేక అనుమతులు తీసుకుని పూర్తిచేశారు.



వికారాబాద్ పట్టణంలోని ఓ వీధిలో కొనసాగుతున్న సీసీ రోడ్డు పనులు

వారంలోపు అమల్లోకి లోక్‌సభ ఎన్నికల కోడ్

- జిల్లాలో ప్రారంభానికి నోచుకోని మెజార్టీ ఉపాధి హామీ పనులు
- నిధులు వెనక్కి వెళ్లే అవకాశం
- కాంట్రాక్టర్లను ఉరుకులు పరుగులు పెట్టిస్తున్న అధికారులు
- నాణ్యతా ప్రమాణాలపై వెల్లువెత్తుతున్న విమర్శలు

వికారాబాద్: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో భాగంగా మెటీరియల్ కంపోనెంట్ కింద కేంద్ర ప్రభుత్వం ఈ యేడాది వికారాబాద్ జిల్లాకు 766 సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులు మంజూరు చేయడంతో పాటు వాటి నిర్మాణం కోసం రూ.59.03 కోట్ల నిధులు కేటాయించింది. ఈ పనులకు సంబంధించి 75 వరకు అంచనాలు తయారు చేయగా మిగతావి ఇంకా తయారు చేయాల్సి ఉంది. అయితే ఈ పనులను పూర్తిచేసేందుకు ఈ ఏడాది మార్చి నెలాఖరు వరకు గడువు ఉంది. కాగా మరో వారం రోజుల్లో లోక్‌సభ ఎన్నికల కోడ్ వచ్చే అవకాశం ఉంది. దీంతో ఆలోపు పనులన్నీ ప్రారంభించాలని జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి ఇంజనీర్లను ఇప్పటికే ఆదేశించారు. ప్రస్తుతం సర్పంచ్‌ల పదవీకాలం కూడా పూర్తయిన నేపథ్యంలో బాధ్యత మొత్తం అధికారులపైనే పడింది. వారం రోజుల్లో అంచనాలు తయారు చేసి పనులన్నీ ప్రారంభిస్తే మార్చి నెలాఖరు వరకు పనులు పూర్తిచేసుకునేందుకు అవకాశం ఉంది. లేదంటే నిధులు వెనక్కి వెళ్లే ప్రమాదం ఉంది. అయితే గతేడాది పాఠంతో అధికారులు.. కాంట్రాక్టర్లను కాస్త ఉరుకులు పరుగులు పెట్టిస్తున్నా.. పనులు మొత్తం ప్రారంభించడం అనేది ప్రశ్నార్థకంగానే మారింది.

నాణ్యతా ప్రమాణాలు పాటించేనా..?

జిల్లా పరిధిలో ఈజీఎస్ ఆధ్వర్యంలో ఏడాదంతా ఉపాధి హామీ పనులు నిర్వహించగా లేబర్ కాంపోనెంట్‌కు దీటుగా మెటీరియల్ కాంపోనెంట్ పనులు పూర్తికాలేదు. 15 రోజుల క్రితం జిల్లాకు లేబర్ కాంపోనెంట్ కింద 766 ఈజీఎస్ పనులు మంజూరు చేశారు. మార్చి నెలాఖరు లోపు ఈ పనులు పూర్తిచేయాలనే నిబంధన ఉంది. అయితే నెలన్నర వ్యవధిలో ఇంత పెద్ద మొత్తంలో పనులు ఎలా పూర్తి చేస్తారనేది ఇప్పుడు ప్రశ్నార్థకంగా మారింది. ప్రస్తుతం పూర్తి కావాల్సిన పనులు వందల్లో ఉండటం.. గడువు తక్కువగా ఉండటంతో అధికారులు, ప్రజాప్రతినిధులు పనులు త్వరితగతిన పూర్తిచేయాలని కాంట్రాక్టర్లపై ఒత్తిడి తెస్తున్నారు. ఒకవేళ హడావిడి చేసి పనులు పూర్తి చేయించినా పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తారా అనేది ఇప్పుడు ప్రశ్నార్థకంగానే మారింది. గతేడాది కూడా ఇదే తరహాలో హడావిడి చేసినప్పటికీ చాలావరకు పనులు మిగిలిపోయాయి. ప్రత్యేక అనుమతి తీసుకుని మిగిలిపోయిన పనులు పూర్తిచేసినప్పటికీ వాటికి సంబంధించిన బిల్లుల కోసం పనులు చేసిన కాంట్రాక్టర్లు, ప్రజాప్రతినిధులు ఆరు నెలలకు పైగా వేచి చూడాల్సి వచ్చింది. ఈసారైనా బిల్లులు సకాలంలో చెల్లించాలని వారు కోరుతున్నారు.

ప్రత్యేకంగా దృష్టి

ఉపాధి హామీ పనులు ప్రారంభించి పూర్తిచేయటకు గడువు తక్కువున్న మాట వాస్తవమే. అయితే ఆయా పనులపై ప్రత్యేక ఫోకస్ పెట్టాం. ఇప్పటివరకు మెజార్టీ పనులు పూర్తయ్యాయి. మిగతా పనులు కూడా పూర్తి చేయించేలా చూస్తాం. నాణ్యత విషయంలో రాజీపడే ప్రసక్తే లేదు. పనులను నిరంతరం పర్యవేక్షిస్తున్నాం.

– ఉమేశ్, ఈఈ, పీఆర్, వికారాబాద్



ప్రజావాణిలో దరఖాస్తులు స్వీకరిస్తున్న కలెక్టర్, అధికారులు

ఫిర్యాదులను పెండింగ్ పెట్టొద్దు

ఎన్ఆర్ఈజీఎస్ పనులను వేగవంతం చేయాలి

- ప్రజావాణిలో దరఖాస్తులు స్వీకరించిన కలెక్టర్ నారాయణరెడ్డి
- అస్వస్థతకు గురైన కొత్తగడి గురుకుల పాఠశాల విద్యార్థినులకు పరామర్శ

వికారాబాద్ అర్బన్: ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ సి.నారాయణ రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజవాణి కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 127 ఫిర్యాదులను అదనపు కలెక్టర్లు రాహుల్ శర్మ, లింగ్యానాయక్, ట్రైనీ కలెక్టర్ నారాయణ అమిత్‌తో కలిసి ఆయన స్వీకరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. అన్ని గ్రామ పంచాయతీల్లో ఎన్ఆర్ఈజీఎస్ సీసీ రోడ్ల పనులను వెంటనే గ్రౌండ్ చేయాలన్నారు. నిధులు వృథా కాకుండా అవసరమైన మెటీరియల్ తెప్పించుకోవడంతో పాటు ఎక్కువ మంది ఉపాధిహామీ కూలీలతో పనులను వేగవంతం చేయాలన్నారు. వేసవిలో ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా మిషన్ భగీరథ నీటి సరఫరా చేపట్టాలన్నారు.

విద్యార్థులను అభినందించిన కలెక్టర్...

వికారాబాద్ పట్టణంలో ఆదివారం నిర్వహించిన ఓపెన్ కరాటే కుంగ్ ఫూ చాంపియన్ షిప్ పోటీల్లో కులకచర్ల మండలానికి చెందిన విద్యార్థినులు ఉత్తమ ప్రతిభ చాటారు. వారందరినీ సోమవారం కలెక్టర్ అభినందించడంతో పాటు మెడల్స్, సర్టిఫికెట్స్ అందజేశారు. విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని అన్నారు.

మెరుగైన వైద్యం అందించాలి

పచ్చకామెర్లతో అస్వస్థతకు గురైన విద్యార్థినులకు మెరుగైన వైద్యం అందించాలని కలెక్టర్ నారాయణరెడ్డి వైద్య శాఖ అధికారులను ఆదేశించారు. సోమవారం కొత్తగడిలోని సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలను ఆయన సందర్శించారు. పాఠశాలలో పచ్చకామెర్ల మూలంగా అస్వస్థతకు గురైన విద్యార్థినుల ఆరోగ్య పరిస్థితిను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థినులకు నాణ్యమైన ఆహారం అందించాలని అధికారులను ఆదేశించారు. పాఠశాల పరిసరాలను శుభ్రంగా ఉంచాలని సిబ్బందిని ఆదేశించారు. కిషెనలో శుభ్రత పాటించాలని సూచించారు. తాగునీటి లీకేజీలతో పాటు, పాఠశాల మరమ్మతులను చేపట్టాలని మున్సిపల్ కమిషనర్ జాకీర్ అహ్మద్‌ను ఆదేశించారు. ఆయన వెంట వైద్యశాఖ అధికారులు ఉన్నారు.

న్యూస్‌రీల్

బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడిగా వివేకానందరెడ్డి



నియామకపత్రం అందుకుంటున్న రాజేందర్‌గౌడ్

ధారూరు: మండల పరిధిలోని నాగారం గ్రామానికి చెందిన వివేకానందరెడ్డి బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడిగా, ధారూరుకి చెందిన రాజేందర్‌గౌడ్ బీజేపీ జిల్లా అధికార ప్రతినిధిగా నియమితులయ్యారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి సోమవారం వారికి నియామకపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వివేకానందరెడ్డి, రాజేందర్‌గౌడ్ మాట్లాడుతూ.. తమ బాధ్యతలు పూర్తిస్థాయిలో నెరవేరుస్తామన్నారు. అందరినీ కలుపుకొనిపోతూ బీజేపీ బలోపేతానికి కృషి చేస్తామన్నారు. తమకు పదవులు రావడానికి సహకరించిన నాయకులకు వారు ధన్యవాదాలు తెలిపారు.

ఎంపీ రంజిత్‌రెడ్డి ప్రత్యేక పూజలు



రంజిత్‌రెడ్డికి బొకే ఇస్తున్న నిర్వాహకులు

అనంతగిరి: అనంతగిరిగుట్ట శ్రీ అనంతపద్మనాభ స్వామి సన్నిధిలో వెలిసిన మార్కండేయ మహర్షి జయంతి ఉత్సవాలను సోమవారం పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆలయంలో ఉదయం నుంచే ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం అన్నదానం చేశారు. ఎంపీ రంజిత్‌రెడ్డి పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అభివృద్ధికి తనవంతు సహకారం ఎల్లప్పుడూ అందిస్తానన్నారు. ప్రతిఒక్కరూ ఆధ్యాత్మిక భావన కలిగి ఉండాలన్నారు. దైవ చింతనతో మానసిక ప్రశాంతత కలుగుతుందన్నారు. అంతకు ముందు స్వామివారిని మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల, మాజీ పీఏసీఎస్ చైర్మన్ కిషన్ నాయక్, మాజీ మున్సిపల్ చైర్మన్ సత్యనారాయణ తదితరులు దర్శించుకున్నారు.

వెల్‌డన్.. గుడ్ జాబ్



బాలాపూర్ పోలీసులను అభినందిస్తున్న సీపీ సుధీర్ బాబు

పహాడీషరీఫ్: ప్రయాణికుడు మరిచిపోయిన విలువైన వస్తువులతో కూడిన బ్యాగ్‌ను కనిపెట్టిన బాలాపూర్ పోలీసులను రాచకొండ పోలీస్ కమిషనర్ అభినందించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పంజాగుట్టకు చెందిన సతీష్ సోదరి వివాహం కోసం మూడున్నర తులాల బంగారం, రూ.50 వేల విలువైన పట్టు చీరలతో కూడిన బ్యాగ్‌ను ర్యాపిడో కారులో పెట్టుకొని బాలాపూర్‌లోని బాలా గార్డెన్‌కు వచ్చాడు. కారులోనే బ్యాగ్‌ను మరిచిపోయాడు. వెంటనే గమనించిన అతడు శివాజీ చౌక్ వద్ద విధి నిర్వహణలో ఉన్న బాలాపూర్ హెచ్‌జీ రవీందర్, హెచ్‌సీ సురేందర్‌కు తెలపడంతో వారు ఇన్‌స్పెక్టర్ వెంకట్‌రెడ్డికి సమాచారం చేరవేశారు. బ్లూకోట్స్, పెట్రోలింగ్ సిబ్బంది, సాంకేతిక ఆధారాలతో కారును గుర్తించి బ్యాగ్‌ను ఫిర్యాదుదారుడికి క్షేమంగా అందజేశారు. దీంతో పోలీసులను రాచకొండ సీపీ సుధీర్ బాబు సోమవారం అభినందించి రివార్డ్‌లను అందజేశారు.

పన్ను చెల్లించని వాహనాలపై ఆర్టీఏ కొరడా

సాక్షి, సిటీబ్యూరో: త్రైమాసిక పన్ను చెల్లించని రవాణా వాహనాలపైన ఆర్టీఏ కొరడా ఝుళిపించింది.గత 11 రోజులుగా నిర్వహించిన తనిఖీల్లో 941 వాహనాలపైన కేసులు నమోదు చేసి రూ.93.73 లక్షల వరకు వసూలు చేసినట్లు హైదరాబాద్ జేటీసీ రమేష్ తెలిపారు.ఒక్క హైదరాబాద్ జిల్లా పరిధిలోనే 642 వాహనాలపైన కేసులు నమోదయ్యాయి.ఈ వాహనాల నుంచి పన్నుల రూపంలో రూ.50 లక్షలు వసూలు చేయగా, జరిమానా రూపంలో మరో రూ.19 లక్షల వరకు రాబట్టారు.సకాలంలో పన్ను చెల్లించకుండా వాహనాలను రోడ్డెక్కిస్తే జరిమానాల రూపంలో భారీ మొత్తంలో చెల్లించుకోవలసి వస్తుందని ఆయన హెచ్చరించారు.ఇప్పటి వరకు పన్ను చెల్లించని వాహనదారులు వెంటనే చెల్లించాలని కోరారు. రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని కోరారు.



ఆమనగల్లు: సమావేశంలో మాట్లాడుతున్న రమ

కార్మిక వ్యతిరేక విధానాలు తగవు

సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షురాలు రమ

ఆమనగల్లు: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా కార్మిక, రైతు వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈనెల 16న దేశవ్యాప్తంగా నిర్వహించే గ్రామీణ భారత్‌బంద్, కార్మికుల సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షురాలు రమ కోరారు. మధ్యాహ్న భోజన పథకంలో పనిచేసేవారిని కార్మికులుగా గుర్తించి రూ.26 వేల కనీస వేతనం అందించాలని డిమాండ్ చేశారు. ఆమనగల్లు పట్టణంలో సోమవారం నిర్వహించిన మధ్యాహ్న భోజన పథకం కార్మికుల సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. దేశంలోని బీజేపీ ప్రభుత్వం మాటలలో జాతీయత, ఆచరణలో విదేశీజపం చేస్తోందని విమర్శించారు. దేశానికి ఆర్థికవనరులను సమకూర్చే ప్రభుత్వరంగ సంస్థలను పెట్టుబడిదారులకు చౌకగా అప్పగిస్తోందని ఆరోపించారు. కార్మికులు ప్రాణత్యాగాలు చేసి సాధించుకున్న 29 చట్టాలను నాలుగు కోడ్‌లుగా మార్చి కట్టు బానిసలుగా మార్చిందని అన్నారు. సమావేశంలో మధ్యాహ్న భోజన పథకం కార్మికుల సంఘం జిల్లా అధ్యక్షురాలు స్వప్న, రాష్ట్ర నాయకులు ఆంజనేయులు, నాయకులు కానుగుల వెంకటయ్య, శివశంకర్, మధ్యాహ్న భోజన కార్మికులు పద్మ, లక్ష్మి, అలివేలు పాల్గొన్నారు.

సమ్మెను విజయవంతం చేయండి

కేశంపేట: ఈనెల 16న నిర్వహించనున్న దేశవ్యాప్త కార్మికుల సమ్మెలో ప్రతి ఒక్కరూ పాల్గొని.. విజయవంతం చేయాలని తెలంగాణ గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు టంగుటూరి నర్సింహారెడ్డి అన్నారు. మండల కేంద్రంలో సోమవారం పంచాయతీ వర్కర్స్‌తో కలిసి సమ్మె వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లేబర్, విద్యుత్ సవరణ బిల్లులను కేంద్ర ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని అన్నారు. 2021లోవిడుదల చేసిన 5 కనీస వేతనాల జీఓలను గెజిట్ చేసి అమలు చేయాలని, స్కీమ్ వర్కర్స్‌ను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. కార్మిక వ్యతిరేక విధానాలను విడనాడాలని హెచ్చరించారు. కార్యక్రమంలో పంచాయతీ వర్కర్లు రాంచంద్రయ్య, రోశయ్య, కొప్పు జంగయ్య, రాములు, యాదయ్య, పద్మమ్మ, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

పలువురు జిల్లా అధికారుల బదిలీ

అనంతగిరి: పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో సోమవారం రాష్ట్ర ప్రభుత్వం పలువురు జిల్లా అధికారులను బదిలీ చేసింది. వారి స్థానంలో వేరే జిల్లాలకు చెందిన అధికారులకు ఇక్కడ పోస్టింగ్ ఇచ్చింది. బదిలీ అయిన అధికారుల వివరాలు..

- వికారాబాద్ జిల్లా పంచాయతీ అధికారిగా విధులు నిర్వహిస్తున్న చక్రవర్తి తరుణ్‌కుమార్‌ను నిజామాబాద్ డీపీఓగా బదిలీ చేయగా, నిజామాబాద్ డీపీఓ పెరక జయసుధను వికారాబాద్ డీపీఓగా బదిలీ చేశారు.
- జెడ్పీ సీఈఓ జానకిరెడ్డిని సంగారెడ్డి సీఈఓగా బదిలీ చేయగా, నిర్మల్ సీఈఓ ముప్పిరి సు . ధీర్‌ను వికారాబాద్‌కు బదిలీ చేశారు.
- జెడ్పీ డిప్యూటీ సీఈఓ సుభాషిణిని రంగారెడ్డి జిల్లా అడిషనల్ డీఆర్‌డీఓగా బదిలీ చేయగా ఆమె స్థానంలో జనగామ డిప్యూటీ సీఈఓ వసంతను వికారాబాద్‌కు బదిలీ చేశారు.
- జిల్లా డీఆర్‌డీఓగా విధులు నిర్వహిస్తున్న కృష్ణన్‌ను యాదాద్రి భువనగిరికి బదిలీ చేయగా, మెదక్ డీఆర్‌డీఓ శ్రీనివాస్‌ను వికారాబాద్‌కు బదిలీ చేశారు.
- అడిషనల్ డీఆర్‌డీఓ స్టీవెన్‌నీల్‌ను ములుగుకు బదిలీ చేశారు.
- వికారాబాద్ డీఎల్‌పీఓ అనితను సంగారెడ్డి జిల్లాకు బదిలీ చేయగా ఆమె స్థానంలో ఇబ్రహీంపట్నం డీఎల్‌పీఓ సంధ్యారాణిని వికారాబాద్ డీఎల్‌పీఓగా బదిలీ చేశారు.
- వికారాబాద్ జిల్లా ఎక్సైజ్ అధికారిగా విధులు నిర్వహిస్తున్న నవీన్‌చంద్రను సంగారెడ్డికి బదిలీ చేయగా మేడ్చల్‌లో విధులు నిర్వహిస్తున్న ఎక్సైజ్ సూపరింటెండెంట్ విజయభాస్కర్‌ను వికారాబాద్‌కు బదిలీ చేశారు.

దేవాదాయ శాఖ ఆధీనంలోకి..

- లక్ష్మీ వేంకటేశ్వస్వామి ఆలయాన్ని పరిశీలించిన అధికారులు
- ఆలయ ఆదాయం, అద్దెలు దేవాదాయ శాఖకు ఇవ్వాలని సూచన
- అధికారులతో బీఆర్ఎస్ నేతల వాగ్వాదం



దేవాలయాన్ని సందర్శించి వివరాలు సేకరిస్తున్న అధికారులు

పరిగి: పరిగి పట్టణ కేంద్రంలోని శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి దేవాలయం ఇక నుంచి దేవాదాయశాఖ ఆధీనంలోకి వస్తుందని.. ప్రైవేట్ వ్యక్తులకు ఎలాంటి సంబంధం లేదని ఆశాఖ ఉమ్మడి జిల్లా అసిస్టెంట్ కమిషనర్ శేఖర్ అన్నారు. పరిగి పట్టణంలోని శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి దేవాలయాన్ని సోమవారం అధికారులతో కలిసి ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. దేవాలయానికి సంబంధించి ఎన్ని షాపింగ్ కాంప్లెక్స్‌లు ఉన్నాయి, ఎంత అద్దె కడుతున్నారు, ఆలయంలో ఏమేమి వస్తువులు, ఆభరణాలు ఉన్నాయని అడిగి తెలుసుకున్నారు. మార్చి నెల నుంచి దుకాణాలకు సంబంధించిన అద్దెలను దేవాదాయ శాఖకు ఇవ్వాలని షాపు నిర్వాహకులకు సూచించారు. అద్దె చెల్లించిన వెంటనే ప్రభుత్వం ద్వారా అందించే రసీదును తీసుకోవాలని సూచించారు. ఆలయ నిర్మాణ ప్రదేశం మూడెకరాల్లో ఉన్నట్లు గుర్తించామని.. మళ్లీ వచ్చి సర్వేనిర్వహించి అన్ని వివరాలు వెల్లడిస్తామన్నారు.

కనీస సమాచారం ఇవ్వరా..

శ్రీ లక్ష్మీ వేంకటేశ్వసామి ఆలయాన్ని దేవాదాయశాఖ అధికారులు ఆధీనంలోకి తీసుకోవడంపై స్థానిక బీఆర్ఎస్ నాయకులు వ్యతిరేకించారు. పరిశీలనకు వచ్చిన అధికారులతో వారు వాగ్వాదానికి దిగారు. దశాబ్దాలుగా దేవాలయ అభివృద్ధికి ధర్మకర్తతో పాటు తాము కూడా ఎంతో కృషి చేస్తున్నామన్నారు. తమకు కనీస సమాచారం లేకుండా ఎలా దేవాదాయ శాఖ ఆధీనంలోకి తీసుకుంటారని వారు ప్రశ్నించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకే తాము ఆలయాన్ని ఆధీనంలోకి తీసుకున్నామని, ఏమైనా అభ్యంతరాలు ఉంటే రాతపూర్వకంగా ఇవ్వాలని నాయకులకు సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తరువాత కాంగ్రెస్ నాయకులు గుడి పేరుతో తెరవెనుక ఉండి రాజకీయం చేస్తున్నారని బీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు. మాజీ డిప్యూటీ స్పీకర్, దివంగత బీఆర్ఎస్ నేత కొప్పుల హరీశ్వర్‌రెడ్డి దాతల ద్వారా దేవాలయానికి కావాలసిన భూములను సేకరించడంతో పాటు ఆయనే ధర్మకర్తగా ఉండి గుడిని అభివృద్ధి చేశారన్నారు. ఆయన సేవలను కనుమరుగు చేసేందుకే కాంగ్రెస్ పార్టీ నాయకులు కుట్ర పన్నుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ శ్రీనివాస్, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

పేదల భూములు లాక్కుంటే ఊరుకోం

- కేఎన్‌పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చంద్రయ్య



బాధితులతో కలిసి నిరసన తెలుపుతున్న నాయకులు

కొడంగల్‌రూరల్: మండల పరిధిలోని అప్పాయిపల్లి శివారు భూములను అభివృద్ధి పేరిట లాక్కోవడానికి చేస్తున్న ప్రయత్నాలను విరమించుకోవాలని కుల నిర్మూలన పోరాట సమితి(కేఎన్‌పీఎస్) రాష్ట్ర ఉపాధ్యక్షుడు చంద్రయ్య, రాష్ట్ర సభ్యులు నాగార్జునరావు, ప్రభుత్వ భూ పరిరక్షణ సమితి రాష్ట్ర నాయకుడు రామన్న హెచ్చరించారు. సోమవారం గ్రామంలోని భూబాధితులతో వారు మాట్లాడారు. గ్రామంలో సర్వే నంబర్ 19లోని 74 ఎకరాల 17 గుంటల భూమిని అభివృద్ధి పనుల నిమిత్తం ప్రభుత్వానికి అప్పగించాలని అధికారులు కోరుతున్నారని బాధితులు వాపోయారు. తాము సాగు చేసుకుంటున్న భూమి పోతోందని ఆవేదనకు గురయ్యారు. ఎంతచెప్పినా వినకుండా అధికారులు సంతకాలు పెట్టాలని బలవంతం పెడుతున్నారని..ఆ భూములు ఇస్తే తాము జీవనాధరం కోల్పోతామని ఆవేదన వ్యక్తం చేశారు. తమ భూములను ఇవ్వ మని ఇప్పటికే అధికారులకు వినతిపత్రాలు అందించినట్లు తెలిపారు.అధికారులు పేదల సాగుభూముల జోలికి రావడం విరమించుకోవాలని చంద్రయ్య కోరారు. కార్యక్రమంలో ఉద్యమకారుల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు ఎరన్పల్లి శ్రీనివాస్, కేఎన్‌పీఎస్ నాయకులు ఇందనూర్ అంజి, వెంకటయ్య, రమేష్, ఆనంద్, అంజిలప్ప, బల్‌రాం, అంజి, రైతులు.. ఫకీరప్ప, అమృతప్ప, రుక్మిణీబాయి, మోతీబాయి, అంజిలయ్య, బసప్ప, బుగ్గప్ప, రాములుగౌడ్, వెంకటమ్మ పాల్గొన్నారు.



క్లుప్తంగా

సీఎం రేవంత్‌రెడ్డితో బీఆర్‌ఎస్ నేత కంచర్ల భేటీ



ముఖ్యమంత్రిని కలిసిన చంద్రశేఖర్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని సినీహీరో అల్లు అర్జున్ మామ, బీఆర్‌ఎస్ పార్టీ నాయకుడు కంచర్ల చంద్రశేఖర్‌రెడ్డి కలిశారు. పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డితో కలిసి సోమవారం అసెంబ్లీ హాల్‌లో సీఎం రేవంత్‌ను కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందనలు తెలిపారు.

16న తాండూరుకు వస్తా

ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి



ఎమ్మెల్యేను కలిసిన మల్కాపూర్ నాయకులు

తాండూరు రూరల్: గ్రామాల్లో నా గెలుపునకు ఎవరు కష్టపడి పని చేశారో నాకు అన్నీ తెలుసు అని ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. మండలంలోని మల్కాపూర్ గ్రామ కాంగ్రెస్ నాయకులు సోమవారం హైదరాబాద్‌లో ఎమ్మెల్యేను కలిశారు. గ్రామ అభివృద్ధికి నిధులు ఇవ్వాలని కోరారు. మల్కాపూర్ గని కార్మిక సొసైటీ ద్వారా పేద కార్మికులకు న్యాయం జరిగేలా కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గంలో నా గెలుపునకు కష్టపడ్డ కార్యకర్తను ఎన్నటికీ మరవనన్నారు. 16న తాండూరుకు వస్తున్నా.. అప్పుడు అన్నీ మాట్లాడుకుందామని చెప్పారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో రాందాస్, నర్సిములు, గోపాల్, కిష్టప్ప, సతీష్, నర్సింలు, మొగులాన్‌లు ఉన్నారు.

చిన్నారిపై వీధికుక్క దాడి

తీవ్ర గాయాలు



చికిత్స పొందుతున్న అభినేష్

పెద్దేముల్: ఆరేళ్ల చిన్నారిపై వీధికుక్క దాడి చేసిన ఘటన సోమవారం పెద్దేముల్ మండల కేంద్రంలో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ఇలా.. పెద్దేముల్ గ్రామానికి చెందిన కోడి శ్రీనివాస్ రెండవ కుమారుడు అభినేష్(6), మండల కేంద్రంలోని వివేకానంద పాఠశాలలో 1వ తరగతి చదువుతున్నాడు. మధ్యాహ్నం 1గంట సమయంలో దుకాణానికి వెళ్తుండగా వీధికుక్క దాడి చేసి తీవ్రంగా గాయపరిచింది. వెంటనే కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం తాండూరు జిల్లా ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆరోగ్యం నిలకడగా ఉందని కుటుంబ సభ్యులు తెలిపారు.

బైక్‌ను ఢీకొన్న ఆర్టీసీ బస్సు

ఒకరికి తీవ్ర గాయాలు



రోడ్డు ప్రమాదంలో గాయపడిన రాములు

పరిగి: బైక్‌ను ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో ఓ వ్యక్తికి తీవ్రగాయాలయిన ఘటన మండల పరిధిలోని హన్మన్‌గండీ సమీపంలో సోమవారం సాయంత్రం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణ కేంద్రంలోని బీసీ కాలనీకి చెందిన బుడగజంగం రాములు తన కుటుంబ సభ్యులతో కలసి ద్విచక్ర వాహనంపై పరిగికి వస్తుండగా, పరిగి నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు బైక్‌ను ఢీకొట్టింది. దీంతో రోడ్డుపై పడ్డ రాములను మరో బైక్ ఢీకొనడంతో రాములు కాలు నుజ్జునుజ్జు అయింది. దీంతో వెంటనే పరిగి ఆస్పత్రికి తరలించి అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం నగరానికి తరలించారు.

సాక్షి క్లాసిఫైడ్స్

WANTED

■ హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఫ్రీ వసతి+ భోజనం. జీ: 18K. Ph: 9640258899, 9640468899 [H-793691]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/ డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

వైభవంగా మార్కండేయ జయంతి



లలితా సహస్రనామ పారాయణం చేస్తున్న భక్తులు



మార్కండేయ స్వామి విగ్రహం

తాండూరు టౌన్ : పట్టణంలోని కొడంగల్ రోడ్డు మార్గంలో ఉన్న శివభక్త మార్కండేయ స్వామి ఆలయంలో స్వామివారి జయంతి వేడుకలు సోమవారం వైభవంగా జరిగాయి. పద్మశాలీల కుల దైవం మార్కండేయ స్వామి జయంతిని పురస్కరించుకుని అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులచే లలిత సహస్రనామ పారాయణం నిర్వహించారు. స్వామివారి పల్లకీ సేవ ఘనంగా నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. మార్కండేయ కాలనీవాసులు, పద్మశాలి కులస్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామి వారిని దర్శించుకున్నారు.

మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌పై దాడి అమానుషం

పట్టణ ఆర్యవైశ్య సంఘం గౌరవ అధ్యక్షుడు రమేష్‌కుమార్



షాద్‌నగర్‌రూరల్: నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ అరుణపై దాడి చేయడం అమానుషమని జిల్లా ఆర్యవైశ్య మహాసభ మాజీ ప్రధాన కార్యదర్శి, పట్టణ ఆర్య వైశ్యసంఘం గౌరవ అధ్యక్షుడు రమేష్‌కుమార్ తీవ్రంగా ఖండించారు. సోమవారం పట్టణంలోని ఆర్య సంఘం కార్యాలయంలో రమేష్‌కుమార్ మాట్లాడుతూ.. తుకాలలో మోసాలు జరిగినా, గిట్టుబాటు ధర రాకపోయినా రైతులు మార్కెట్ కమిటీ చైర్మన్‌కు,సెక్రటరీకి లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేయాలే తప్పా ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడటం సమంజసం కాదని హితవు పలికారు. మహిళ అని చూడకుండా రైతులు ఆమెను కొట్టుకుంటూ తీసుకురావడం సరికాదన్నారు. అచ్చంపేట మార్కెట్ కమిటీ చైర్మన్‌లుగా ఎందరో పని చేశారని, వారిపై దాడి చేసిన ఘటనలు ఎప్పుడు లేవన్నారు. దోషులను శిక్షించే వరకు రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపట్టేందుకు ఆర్యవైశ్యులు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం తగు చర్యలు తీసుకొని, దాడికి పాల్పడిన వారిపై వెంటనే కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.

ఆలయంలో చోరీ

తాండూరు రూరల్: మండల పరిధిలోని వీరారెడ్డిపల్లి శివారులో ఉన్న వీరభద్రేశ్వర స్వామి ఆలయంలో సోమవారం చోరీ జరిగింది. కరన్‌కోట్ ఎస్‌ఐ విఠల్‌రెడ్డి వివరాల ప్రకారం.. వీరారెడ్డిపల్లి శివారులో వీరభద్రేశ్వర ఆలయంలో గుర్తు తెలియని వ్యక్తులు హుండి పగల గొట్టి నగదును అపహరించుకుపోయారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకోని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

తాండూరు రూరల్: మండల పరిధిలోని వీరారెడ్డిపల్లిలో పేకాట రాయుళ్లను సోమవారం అరెస్ట్ చేశారు. కరన్‌కోట్ ఎస్‌ఐ విఠల్‌రెడ్డి వివరాల ప్రకారం.. మండల పరిధిలోని వీరారెడ్డిపల్లికి చెందిన వెంకటప్ప, అంజీలప్ప, బంటు నర్సింలు, ఈదుల ఆశప్ప, నల్లొల్ల అంజీలప్ప, కుర్వ మల్లప్పలు పేకాట ఆడుతున్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు పేకాటరాయుళ్లను అరెస్ట్ చేసి వారి నుంచి రూ.3175 నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. గ్రామాల్లో ఎవరైనా పేకాట ఆడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ విఠల్‌రెడ్డి హెచ్చరించారు.

కుటుంబ పాలన పోయింది..



కార్నర్ మీటింగ్‌లో పాల్గొన్న వంశీచంద్ రెడ్డి

- పేదల ప్రభుత్వం వచ్చింది
- సీడబ్ల్యూసీ మెంబర్ చల్లా వంశీచంద్ రెడ్డి
- కొందుర్గు, జిల్లేడ్ చౌదరిగూడ మండలాల్లో కొనసాగిన న్యాయయాత్ర

కొందుర్గు: రాష్ట్రాన్ని తొమ్మిదేళ్ల పాటు దోచుకున్న బీఆర్‌ఎస్ కుటుంబ పాలనకు ప్రజలు తగిన గుణపాఠం చెప్పారని సీడబ్ల్యూసీ మెంబర్ చల్లా వంశీచంద్ రెడ్డి అన్నారు. సోమవారం కొందుర్గు మండలం ఆగిర్యాలలో ప్రారంభమైన కాంగ్రెస్ న్యాయ పాదయాత్ర వెంకిర్యాల తంగళ్లపల్లి మీదుగా కొందుర్గు మండల కేంద్రానికి చేరుకుంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్నర్ మీటింగ్‌లో వంశీచందర్ రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ బడుగు, బలహీన వర్గాల పార్టీ అన్నారు. పేదల సంక్షేమానికి ఆరు గ్యారంటీలను అందించడానికి ముందుకొచ్చిందన్నారు. ఇప్పటికే రెండు గ్యారంటీలు అమలయ్యాయని, త్వరలోనే మరో నాలుగు గ్యారంటీలు అమలు చేస్తామని స్పష్టం చేశారు. 2018 అసెంబ్లీ ఎన్నికల ప్రచారానికి వచ్చిన అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ కుర్చీ వేసుకొని పాలమూరు ఎత్తిపోతల ప్రాజెక్టు నిర్మిస్తానని నమ్మించి ఇక్కడి ప్రజలతో ఓటు వేయించుని గెలిచిన అనంతరం ప్రాజెక్టులో తట్టెడు మట్టి కూడా తీయలేదని విమర్శించారు. పాలమూరు అభివృద్ధే కాంగ్రెస్ లక్ష్యమని, కేంద్రంలో పార్టీ అధికారంలోకి వస్తే పాలమూరు ఎత్తిపోతల ప్రాజెక్టుకు జాతీయ హోదా కల్పిస్తామని హామీ ఇచ్చారు. వచ్చే నెల రోజుల్లో 65 వేల పేద కుటుంబాలకు కరెంటు బిల్లు మాఫీ చేస్తామన్నారు.

వంశీచంద్ రెడ్డిని ఎంపీగా గెలిపిద్దాం..

నన్ను గెలిపించిన వారందరూ వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఓటువేసి వంశీచంద్ రెడ్డిని ఎంపీగా గెలిపించాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కోరారు. కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని మాట తప్పిందని ఎద్దేవా చేశారు. ఈ సందర్భంగా ఎంపీ శ్రీనివాస్‌రెడ్డి తెలంగాణ రాష్ట్రం గురించి ఏనాడు పార్లమెంట్‌లో మాట్లాడకపోవడం బాధాకరమన్నారు. పాలమూరు, రంగారెడ్డి అభివృద్ధి చెందాలంటే వంశీచందర్ రెడ్డి ఎంపీగా గెలవాలన్నారు. అనంతరం కొందుర్గు నుంచి చౌదరిగూడ మండలం ఎదిర, రావిర్యాల, గుర్రంపల్లి మీదుగా జిల్లేడ్ చౌదరిగూడ మండలానికి న్యాయ పాదయాత్ర తరలి వెళ్లింది. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు చల్లా నర్సింహ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ప్రతాప్ రెడ్డి, కాంగ్రెస్ మండల కమిటీ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, కావలిరాజు, కొత్తూర్ మాజీ జెడ్పీటీసీ శ్యామ్‌సుందర్ రెడ్డి, నాయకులు పురుషోత్తం రెడ్డి, జితేందర్ రెడ్డి, సత్యనారాయణ రెడ్డి, యాదయ్య, మల్లయ్య, లింగం గౌడ్, గోవర్ధన్ గౌడ్, జహంగీర్, వజ్రమ్మ, రామయ్య గౌడ్, రామకృష్ణ గౌడ్, నరేందర్, రవి, ప్రవీణ్, భాస్కర్, సత్యనారాయణ రెడ్డి, చంద్రశేఖర్, ఆంజనేయులు పాల్గొన్నారు.

ధారూరు ఇన్‌చార్జి ఏపీఎంగా సీసీ పండరీ



ధారూరు: ధారూరు మండల ఇందిరా క్రాంతి పథకం ఇన్‌చార్జిగా సీసీ పండరీకి బాధ్యతలు అప్పగించారు. ఇక్కడి ఏపీఎం శ్రీనివాస్ గత 23న సస్పెన్షన్ అయ్యారు. ఉన్నతాధికారులు ఆదేశాలను బేఖాతరు చేస్తూ, తరుచూ సమావేశాలకు హాజరు కాకపోవడం, విధుల్లో నిర్లక్ష్యం వ్యవహరించడం వంటి కారణాల వల్ల ఏపీఎం శ్రీనివాస్‌పై సస్పెన్షన్ వేటు పడింది. ప్రస్తుతం సీనియర్ సీసీ పండరీ ఇన్‌చార్జిగా ఏపీఎంగా కొనసాగుతున్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి



అరవింద్ (ఫైల్)

శంకర్‌పల్లి: బైక్‌తో ఆగి ఉన్న కారును ఢీకొట్టిన వ్యక్తి చిత్సపొందుతూ సోమవారం మృతి చెందాడు. మోకిల ఎస్సై కోటేశ్వరావు తెలిపిన వివరాల ప్రకారం.. శంకర్‌పల్లి పట్టణ కేంద్రానికి చెందిన అరవింద్ (23), శ్రీకాంత్(26) ఆదివారం సాయంత్రం హైదరాబాద్ నుంచి శంకర్‌పల్లి వైపు బైక్‌పై వస్తున్నారు. మోకిల భారత్ పెట్రోల్ బంక్ వద్ద రోడ్డుపై ఆగి ఉన్న కారును వెనుక నుంచి వేగంగా ఢీకొట్టడంతో ఇద్దరి తీవ్ర గాయాలయ్యాయి. పరిస్థితి విషమంగా ఉండడంతో నగరంలోని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. అరవింద్ సోమవారం ఉదయం మృతి చెందగా శ్రీకాంత్ పరిస్థితి కూడా విషమంగా ఉందని ఎస్సై తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

కార్మికుల సమస్యల పరిష్కారానికే సమ్మె

సీపీఎం జిల్లా కార్యదర్శి వెంకటయ్య



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న సీపీఎం నాయకులు

పరిగి: కార్మికుల సమస్యలను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు చేపట్టిన కార్మిక సమ్మెకు ప్రతి ఒక్కరూ తరలిరావాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వెంకటయ్య పిలుపునిచ్చారు. ఈ నెల 16న దేశ వ్యాప్త కార్మిక సమ్మెలో భాగంగా సోమవారం పట్టణ కేంద్రంలోని వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. దేశంలో కార్మికులు ఎన్నో రంగాల్లో పని చేస్తూ కుటుంబాన్ని కూడా పోషించలేని పరిస్థితిలో ఉన్నారన్నారు. కేంద్ర బీజేపీ ప్రభుత్వం కార్మికుల పొట్ట కొడుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్మికుల సమస్యలు పరిష్కరించే వరకు పోరాటం చేస్తునే ఉంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు హబీబ్, సత్తయ్య, రాఘురాం, శేఖర్ పాల్గొన్నారు.

పేదలకు సేవ చేయడంలోనే సంతృప్తి



విద్యార్థులతో మాట్లాడుతున్న సింగర్ స్మిత

సింగర్ స్మిత

బొంరాస్‌పేట: తమకు అందే అవకాశాలతో ప్రజలకు సేవ చేస్తే ఎంతో సంతృప్తిగా ఉంటుందని పాప్ సింగర్ స్మిత అన్నారు. సోమవారం కొడంగల్ పట్టణంలోని ప్రభుత్వ జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో దాత పాప్ సింగర్ స్మిత 'మాటా ముచ్చట' కార్యక్రమంలో పాల్గొన్నారు. జిల్లా వాప్తంగా పలు పాఠశాలల్లోని నిరుపేద విద్యార్థులకు నాలుగు నెలల క్రితం ట్యాబ్‌లు అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల అనుభవాలను పంచుకున్నారు. ఎంఈఓ, హెచ్‌ఎం కె.రాంరెడ్డి ఆధ్వర్యంలో స్మితను సన్మానించారు. మాటా ముచ్చట కార్యక్రమంలో భాగంగా అందజేసిన ట్యాబ్ వినియోగం గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల విద్యార్థులు ట్యాబ్‌ల వినియోగ అనుభవాలను స్మితకు వివరించారు. ఇవి తమలాంటి విద్యార్థుల చేతుల్లోకి రావడం అదృష్టంగా భావిస్తున్నామన్నారు. ట్యాబ్‌ల ద్వారా విద్యార్థులకు గణితం, ఛాలెంజర్స్ ఎంతో ఉపయోగ పడుతున్నాయని ఎస్‌ఆర్‌పీ వీరేశం అన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ రవీంద్రయాదవ్, హరివిల్లు మురారి, చంద్రకాంత్, అనిల్, గౌరారం గోపాల్, బాకారం చంద్రశేఖర్, లక్ష్మి, విజయలక్ష్మి, అనిల్‌కుమార్, వెంకటేశం తదితరులున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు



తీవ్రంగా గాయపడిన బస్వరాజ్

తాండూరు రూరల్: లారీని వెనక నుంచి బైక్ ఢీకొట్టిన ఘటనలో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన కరన్‌కోట్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కోటబాసుపల్లిలో సోమవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ విఠల్‌రెడ్డి కథనం ప్రకారం.. కర్ణాటక రాష్ట్రం చించోళి తాలుక చౌడపూర్‌కు చెందిన బస్వరాజ్ బైక్‌పై తాండూరు వస్తున్నాడు. సోమవారం మధ్యాహ్నం కోటబాసుపల్లి శివారులోని కేరళ మాడల్ స్కూల్ వద్ద ముందు వెళ్తున్న లారీని బైక్‌తో ఢీకొట్టాడు. దీంతో బస్వరాజ్‌కు తీవ్రగాయాలయ్యాయి. వెంటనే అంబులెన్స్‌లో తాండూరు జిల్లా ఆస్పత్రికి తరలించారు. బైక్‌పై వెళ్తున్న బస్వరాజ్ వద్ద కల్లు, కర్ణాటకకు చెందిన గుట్కాలు ఉన్నాయి. నిర్లక్ష్యంగా నడిపిన లారీడ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఘనంగా పెద్దమ్మతల్లి కల్యాణోత్సవం



సదరు పటంలోకి ప్రవేశిస్తున్న శివసత్తులు



అమ్మవారి కల్యాణం జరిపిస్తున్న విఠల్‌బాబా

పహాడీషరీఫ్: జల్‌పల్లి గరిగుట్ట అమ్మవారి కల్యాణ మహోత్సవం సోమవారం నేత్ర పర్వంగా కొనసాగింది. ఉత్సవాలలో చివరి రోజు కావడంతో ఒగ్గు కళాకారులు ఆలయం ఆవరణలో చక్కటి ముగ్గులతో సదరు పటాన్ని వేశారు. అనంతరం ఆలయ ధర్మకర్త కరన్‌కోట్ విఠల్‌బాబా పర్యవేక్షణలో అమ్మవారికి ఒడి బియ్యం సమర్పించారు. శివసత్తులకు ఆచారాల సమర్పణ కార్యక్రమం శాస్త్రోక్తంగా కొనసాగింది. ఈ సందర్భంగా జరిగిన అమ్మవారి కల్యాణాన్ని తిలకించేందుకు భక్తులు పెద్ద హాజరయ్యారు. అనంతరం విఠల్‌బాబా అమ్మవారి ఆలయంలో 50 మంది శివసత్తులతో కలిసి అగ్నిగుండాల ప్రవేశం చేశారు. జల్‌పల్లి కౌన్సిలర్ యాదగిరి అన్నదాన కార్యక్రమం చేశారు. ఈ సందర్భంగా ఒగ్గు కళాకారుల కథలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. జల్‌పల్లి మున్సిపాలిటీ డీఈ వెంకన్న, పోలీసు అధికారులను సన్మానించారు. కార్యక్రమంలో గ్రామ నాయకులు యంజాల అర్జున్, ఎనగండ్ల శ్రీధర్‌గౌడ్, శ్రీనురెడ్డి, శ్రీకాంత్‌గౌడ్ పాల్గొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం



కాలిపోయిన వస్తువులు

కాలిపోయిన ఇంట్లోని వస్తువులు



ఆర్థిక సహాయం అందజేస్తున్న కాంగ్రెస్ నాయకుడు శ్రీకాంత్‌రెడ్డి

చేవెళ్ల: షార్ట్ సర్క్యూట్‌తో ఓ ఇల్లు కాలి బుడిదయిన ఘటన మండల కేంద్రంలోని భగత్‌సింగ్ కాలనీలో సోమవారం చోటు చేసుకుంది. బాధితులు, స్థానికు లు తెలిపిన ప్రకారం.. మండల కేంద్రంలోని సన్నా యి శ్రీనివాస్, రాధికల ఇంట్లో షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగి నిత్యావసరాలు, 20వేల నగదు, సర్టిఫికెట్లు కాలిబుడిదయ్యాయి. స్థానికులు, ఫైర్ ఇంజన్ సహాయంతో మంటలను అదుపులోకి తెచ్చారు. అప్పటికే ఇంట్లోని వస్తువులు మొత్తం కాలిపోయాయి. దీంతో బాధితులు బోరున విలపించారు. సుమారు రూ.5 లక్షల ఆస్తినష్టం జరిగినట్లు వాపోయారు. స్పందించిన ఆర్‌ఐ రాజేశ్, విద్యుత్ ఏఈ జానీమోహిన్‌దీన్‌లు పరిశీలించి పంచనామా చేశారు. ఉన్నతాధికారులకు నివేదికను అందించి బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందేలా కృషి చేస్తామని చెప్పారు. చేవెళ్ల కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ జూకన్నగారి శ్రీకాంత్‌రెడ్డి రూ.20వేలు, పూజారులు శ్రీకాంత్, శ్రీపాదులు రూ.10వేలు, మాజీ వార్డు సభ్యుడు శ్రీనివాస్ రూ.5వేలు బాధిత కుటుంబానికి అందజేశారు.

నిధులు లేక ఆగిన అభివృద్ధి పనులు

ప్రారంభానికి నోచుకోని భవనాలు

- సౌకర్యాలు లేని యాచారం ఆర్టీసీ బస్టాండ్
- శిలాఫలకానికే పరిమితమైన ఆస్పత్రి భవనం
- నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి



శిలాఫలకానికే పరిమితమైన ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రం

యాచారం: కోట్లాది రూపాయల నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులు నిధులు లేక నిలిచిపోవడం, పూర్తయిన భవనాలు ప్రారంభానికి నోచుకోకపోవడం, కొన్ని అభివృద్ధి పనులు శిలాఫలాకాలకే పరిమితమయ్యాయి. వ్యాపారపరంగా దినదినాభివృద్ధి చెందుతున్నా, మండలంలో అసంపూర్తిగా నిలిచిన అభివృద్ధి పనులు పూర్తి చేస్తే మరింత అభివృద్ధి చెందే అవకాశం ఉంటుందని మండల ప్రజలు ఎమ్మెల్యే సార్ యాచారం మండలం వైపు దృష్టి పెట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

నిలిచిన అభివృద్ధి పనులు

రూ. కోటి నిధుల ప్రణాళికతో ఎనిమిదేళ్ల కింద మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో రూ. 20 లక్షలు ఖర్చు చేసి సమావేశపు హాల్ పనులు ప్రారంభించారు. నిధులు లేవని సాకుతో పనులు ఆగిపోయాయి. ప్రస్తుతం ఉన్న సమావేశపు హాల్ ఇరుకుగా ఉండడంతో మండల పరిషత్ సర్వసభ్య సమావేశాలు, ఇతర ముఖ్యమైన సమావేశాల సమయాల్లో కొందరు అధికారులు, ప్రజాప్రతినిధులు హాల్ బయటనే ఉండాల్సి వస్తుంది. పదేళ్ల క్రితం రూ.25 లక్షల జెడ్పీ నిధులతో మండల కేంద్రంలో అతిథి గృహం నిర్మాణ పనులను ప్రారంభించి, నాలుగేళ్ల క్రితం పనులు పూర్తి చేశారు. కానీ, జెడ్పీ అతిథి గృహం మాత్రం ప్రారంభానికి నోచుకోవడం లేదు. ఆ భవనం నేడు విషసర్పాలకు, పక్షులకు ఆవాసాలుగా మారింది. ప్రారంభానికి ముందే ఆ భవనం శిథిలావస్థకు చేరుతోంది. అలాగే రూ. కోటిన్నర నిధులతో గతేడాది యాచారం మండల కేంద్రంలో ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రం నూతన భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. నిధులు లేవనే సాకుతో అధికారులు నాలుగు నెలలైన ఆస్పత్రి భవన నిర్మాణ పనులు మొదలు పెట్టడం లేదు. ఏళ్ల కింద నిర్మించిన ఆస్పత్రి భవనంలోనే వైద్యులు రోగులకు సేవలు అందిస్తున్నారు. వర్షాలు కురిస్తే భవనం పూర్తిగా కురుస్తుంది. భవనం పైపెచ్చులుడి పడుతుండటంతో వైద్యులు నిత్యం భయంతో డ్యూటీ చేస్తున్నారు.

- మహాలక్ష్మి పథకం పుణ్యామాని యాచారం మండల కేంద్రంలో 20 ఏళ్ల కింద నిర్మించిన ఆర్టీసీ బస్టాండ్‌కు బస్సులు రాకపోకలు సాగిస్తున్నాయి. కాని బస్టాండ్‌లో తాగునీటి వసతి, మరుగుదొడ్లు, మూత్రశాలలు, ఇతర సౌకర్యాలు లేకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. మాల్‌లోని ఆర్టీసీ బస్టాండ్ కూడా నిరుపయోగంగా ఉంది.
- మండల కేంద్రంలోనే కాకుండా నల్లవెల్లి, చింతపట్ల, మంతన్‌గౌరెల్లి, నందివనపర్తి, గునుగల్, గడ్డమల్లయ్యగూడ, మాల్ తదితర గ్రామాల్లో దాదాపు రూ. 20 కోట్లకు పైగా నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులు పూర్తి కాక కొన్ని, ప్రారంభానికి నోచుకోక గ్రహణం పట్టినట్లు ఉన్నాయి.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తా



యాచారం మండలంలో చాలా వరకు పంచాయతీ రాజ్ శాఖ నిధులతోనే పూర్తి చేసే అభివృద్ధి పనులు ఉన్నాయి. జెడ్పీ అతిథి గృహం, ఆస్పత్రి భవనం, సమావేశపు హాల్ నిర్మాణం తదితర అభివృద్ధి పనులు పూర్తి చేయాల్సి ఉంది. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి నిర్మాణ పనులు పూర్తి చేసేలా కృషి చేస్తా. ఎంపీపీ, ఎంపీడీఓలతో కూడా చర్చిస్తా.

– ఉస్మాన్, ఏఈ పంచాయతీ రాజ్ శాఖ